టీజీఐఐసీ నిర్లక్ష్యంతో అమాయకులు బలి!

- పరిశ్రమలకు సేకరించిన భూములను విక్రయిస్తున్న పట్టాదార్లు
- పరిహారం చెల్లించినా తమపేర రిజిస్ట్రేషన్ చేయించుకోని టీజీఐఐసీ
- రికార్డుల్లో ఇంకా పట్టాదార్ల పేర్లు.. మోసపోతున్న ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) నిర్లక్ష్యం కొందరు అమాయకులకు శాపంగా మారుతున్నది. ఏండ్ల క్రితం పరిశ్రమల కోసం సేకరించిన భూములను కూడా టీజీఐఐసీ తన పేర మ్యుటేషన్ చేయించుకోకపోవటంతో నష్టపరిహారం తీసుకున్న పట్టాదార్లు తమ భూములను అమాయకులకు అంటగడుతున్నారు. భూములు కొనుగోలు చేసినవారు వాస్తవం తెలిసిన తర్వాత లబోదిబోమంటున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు లెక్కలేనన్ని ఉండొచ్చని అధికారులే అంగీకరిస్తున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి, మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం పరిశ్రమలకు విక్రయించడం టీజీఐఐసీ బాధ్యత. రైతుల నుంచి సేకరించిన భూములను నష్టపరిహారం చెల్లించిన వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా చేయడంవల్ల పట్టాదార్లు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు. అయితే టీజీఐఐసీకి చెందిన అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా ప్రాంతాల్లో సేకరించిన భూములు ఇంకా పట్టాదార్ల పేర్లతోనే కొనసాగుతుండటంతో వారు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీనివల్ల కొనుగోలు చేస్తున్న అమాయకులు మోసపోతున్నారు. ఉదాహరణకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో వివిధ సర్వే నంబర్లలో దాదాపు 20 ఏండ్ల క్రితం అప్పటి ఏపీఐఐసీ సుమారు 200 ఎకరాల భూములు సేకరించింది. అందులో పావువంతు భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు కాగా, మిగిలిన భూములు ఖాళీగానే ఉన్నాయి. భూములు సేకరించినా వాటిని పరిశ్రమల పేరుతో గానీ, ఏపీఐఐసీ పేరుతోగానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. దీంతో ఇంకా ఆ భూములు పట్టాదార్ల పేరు మీదే ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వాటిని మళ్లీ ఇతరులకు విక్రయించారు.

చేతులెత్తేసిన టీజీఐఐసీ

సర్వే నంబరు 81 పరిధిలో ఇటువంటి ఘటన ఒకటి తాజాగా వెలుగు చూసింది. 20 ఏండ్ల క్రితం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఆరు ఎకరాల భూమి ఇప్పటికే నలుగురు చేతులు మారింది. తీరా ఐదో వ్యక్తి దాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, టీజీఐఐసీ పేర రిజిస్టర్ అయినట్టు రికార్డులు చూపుతున్నాయి. దీంతో విక్రయానికి ఉంచిన ఆ నాలుగో వ్యక్తి తాను మోసపోయానని లబోదిబోమంటున్నాడు. తాను పట్టాదారు వద్ద భూమి కొనుగోలు చేసినట్టు, తన భూమిని విక్రయించేందుకు ఎన్వోసీ ఇవ్వాలని బాధితుడు టీజీఐఐసీని వేడుకొంటున్నాడు. అధికారులు మాత్రం ఎన్వోసీ ఇచ్చే ఆస్కారం లేదని చేతులెత్తేశారు. ఆ 200 ఎకరాల భూముల్లో ఇలాంటి ఇంకా ఎన్ని ఉన్నాయో తేలాల్సి ఉన్నది.

స్థానికంగా విచారించుకొని కొనుగోలు చేయాలి: టీజీఐఐసీ

పారిశ్రామిక ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేయాలనుకొనేవారు సమగ్రంగా విచారించుకొని, స్థానికులతో మాట్లాడిన తర్వాతే భూములు కొనుగోలు చేయాలని టీజీఐఐసీ అధికారులు సూచిస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల తాము సేకరిస్తున్న భూములను వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతున్నామని, దీన్ని ఆసరాగా చేసుకొని పట్టాదార్లు నష్టపరిహారం తీసుకొని కూడా ఇతరులకు విక్రయించుకొంటున్నట్టు తెలిసిందని చెప్తున్నారు. సేకరించిన భూములను టీజీఐఐసీ పేర మ్యూటేషన్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉంటుందని, వాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము చేసేదేమీ లేదని స్పష్టంచేస్తున్నారు. మొత్తంగా అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ఎంతోమంది మోసపోతున్నారు.

అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(జీసీఎంఎంఎఫ్) అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల(7 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్టు 50వ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం అనంతం వెల్లడించింది. అలాగే గ్రూపు టర్నోవర్ రూ.80 వేల కోట్లు(10 బిలియన్ డాలర్లు)గా నమోదైందని తెలిపింది. 2022-23 ఏడాదికిగాను 72 వేల కోట్లు(9 బిలియన్ డాలర్లు) ఆర్జించింది. ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార బ్రాండ్, బలమైన పాల ఉత్పత్తుల బ్రాండ్‌గా అమూల్ ఎదిగింది. రైతులే యజమానిగా ఎదిగిన అమూల్ కో-ఆపరేటివ్ సొసైటీలో 36 లక్షల మంది రైతుల నుంచి రోజుకు 300 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. ఈ సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ శామల్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ..జీసీఎంఎంఎఫ్ మరో చారిత్రక మైలురాయికి చేరుకున్నదని, ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార పదార్థాల బ్రాండ్‌గా అవతరించిందన్నారు.

బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్

60 రోజుల వ్యాలిడిటీతో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరో ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 60 రోజుల కాలపరిమితితో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 1జీబీ డాటాతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌ను అందిస్తున్నట్టు తెలిపింది. 4జీ సేవలు అందించడానికి సిద్ధమతున్న సంస్థకు ఈ నూతన ప్లాన్‌తో కస్టమర్లకు అధిక ప్రయోజనాలు లభించనున్నాయని తెలిపింది. ఇతర టెలికం సంస్థల కంటే బీఎస్ఎన్ఎల్ టారిఫ్‌లు చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఇరు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీనం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నది. ఈ విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన 100 ఈక్విటీ షేర్లకుగాను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌నకు చెందిన 155 ఈక్విటీ షేర్లు లభించనున్నాయి.

నూతన కార్ల సందడే..సందడి

వచ్చే నెలలో విడుదలకానున్న ఐదు మాడళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. ఇప్పటికే ప్రతి నెలలో అర డజన్‌కు పైగా మాడళ్లను విడుదల చేస్తున్న సంస్థలు..వచ్చే నెలలోనూ ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ ఐదు మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో కియా, నిస్సాన్, బీవైడీ, మెర్సిడెజ్ బెంజ్‌లు ఉన్నాయి. ఈ వివరాలు..

కియా నుంచి రెండు మాడళ్లు

కొరియాకు చెందిన వాహన సంస్థ కియా.. దేశీయ మార్కెట్లోకి నయా కార్నివాల్‌ను విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 3న మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఈ కారు ధర రూ.50 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. 2.2 లీటర్ 4-సిలిండర్ డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు 193 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. దీంతోపాటు మరో ఈవీ మాడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 99.8 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసిన ఈవీ 9లో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. కేవలం 24 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జింగ్‌కానున్నది.

నిస్సాన్ మ్యాగ్నైట్ ఫెసిలిఫ్ట్

వచ్చే నెల 4న మ్యాగ్నైట్ ఫెసిలిఫ్ట్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది నిస్సాన్ ఇండియా. దేశీయ మార్కెట్‌తోపాటు ఇతర దేశాలకు అనుగుణంగా లెఫ్ట్-హ్యాండ్ డ్రైవ్ వెర్షన్ కూడా తీసుకురాబోతున్నది.

బీవైడీ ఈమ్యాక్స్ 7

చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ మరో మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 8న ఈమ్యాక్స్ 7 మాడల్‌ను అందుబాటులోకి తెస్తున్నది. అడాస్ సూట్, ప్రీమియం స్విచ్ గేర్, సాఫ్ట్-టచ్ మెటీరియల్స్, లగ్జరీ లుక్‌తో తీర్చిదిద్దింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారులో 55.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 420 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్

జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 14.4 ఇంచుల సెంట్రల్ టచ్‌స్క్రీన్‌తోపాటు 12.3 ఇంచుల ప్యాసింజర్ టచ్‌స్క్రీన్, 4డీ సరౌండింగ్ సౌండ్ సిస్టమ్ కలిగిన ఈ మాడల్‌ను 2.0 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది.

ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లు

ముంబై, సెప్టెంబర్ 28: ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నది. ఐఫోన్ 16ని కొనుగోలు చేసినవారికి రూ.5 వేల ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చునని తెలిపింది. అలాగే ఈఎంఐ ఆప్షన్‌లో నెలకు రూ.2,497 చెల్లించి ఈ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చునని సూచించింది. ఈ ఆఫర్లు డిసెంబర్ 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. పాత ఐఫోన్ కలిగివున్నవారు అప్‌గ్రేడ్‌తో ఐఫోన్ 16ని కొనుగోలు చేసిన వారికి క్యాష్‌బ్యాక్‌తోపాటు వడ్డీ రహిత ఈఎంఐని ఎంచుకోవచ్చునని సూచించింది. ఈ ఆఫర్ కేవలం ఐఫోన్ 16 ప్రొ మ్యాక్స్, ఐఫోన్ 16 ప్రొ, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16 మాడళ్లకు వర్తించనున్నది. ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లు అప్‌ట్రానిక్స్, యూనికార్న్, క్రోమా, రిలయన్స్, విజయ సేల్స్, సంగీత మొబైల్స్‌లో లభించనున్నది.

రియల్టీ సంస్థలపై రెరా కొరడా

వెయ్యికిపైగా ప్రాజెక్టులపై రూ.35 కోట్ల జరిమానా

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై రెరా కొరడా ఝులిపించింది. మార్కెటింగ్ కార్యకలాపాలు, ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ఉక్కుపాదం మోపడానికి రెరా పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో రెరా ఏర్పాటైన గడిచిన ఏడేండ్లలో ఏకంగా వెయ్యికి పైగా ప్రాజెక్టులపై రూ.36 కోట్ల వరకు జరిమానా విధించింది. వీటిలో ఇప్పటికే రూ.15 కోట్లను ఆయా సంస్థలు చెల్లించాయి కూడా. ఎనిమిది కంటే ఎక్కువ ప్లాట్లను విక్రయించిన, 600 గజాలు అంత కంటే ఎక్కువ స్థలంలో నిర్మించి విక్రయాలు చేసినా ప్రాజెక్టులు రెరా పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సంస్థలు తప్పకుండా రెరా వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రెరా వద్ద నమోదు చేసుకోకుండానే విక్రయాలు జరిపితే ఆయా ప్రాజెక్టులు చేపట్టిన సంస్థలపై ఈ మండలి భారీస్థాయిలో జరిమానా విధిస్తున్నది.

రెరా ఏర్పాటైన తరువాత వివిధ ప్రాజెక్టులకు విధించిన జరిమానాలు		
సంవత్సరం	ఫైన్ వేసిన ప్రాజెక్టులు	జరిమానా మొత్తం (రూ.కోట్లలో)
2018-19	335	3.06
2019-20	49	0.79
2020-21	04	0.29
2021-22	03	0.23
2022-23	180	1.70
2023-24	311	26.69
2024-25	131	2.96
మొత్తం	1013	35.72

రెరా నంబర్ లేకుండానే ప్రకటనలు..

రెరా నంబర్ లేకుండానే రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు జారీ చేసిన సంస్థలపై ఫిర్యాదులు అందడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వాణిజ్య ప్రకటనలపై ఖచ్చితంగా రెరా నంబర్ ఉండాల్సిందేనని షరతు విధించింది. దీంతో తమ ప్రకటనల పక్కన రెరా నంబర్‌ను ఖచ్చితంగా ముద్రిస్తున్నాయి. ప్రీలాంచ్ ఆఫర్లు, ముందస్తుగా ఒప్పందం చేసుకున్న మేరకు ప్లాట్లను అప్పగించకపోవడం, వాటిలో సరైన వసతులు కల్పించకపోయిన ప్రాజెక్టులపై కూడా చర్యలు తీసుకున్నది. ఒక దగ్గర ప్రాజెక్టు నమోదు చేసుకొని..అదే అనుమతితో మరి కొన్ని చోట్ల విక్రయాలు చేస్తున్న ప్రాజెక్టులను గుర్తించడానికి ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న షైన్ విద్యాసంస్థల చైర్మన్ కుమార్‌యాదవ్

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

న్యూశాయంపేట, సెప్టెంబర్ 28 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఆ దిశగా పయనించాలని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్ అన్నారు. శనివారం హంటర్ రోడ్డులోని డీ-కన్వెన్షన్ హాల్లో షైన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్ ఫోన్స్ దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, శ్రీనివాసన్, ప్రశాంత్, సంధ్య పాల్గొన్నారు.

ఉరేసుకొని డీఆర్ఎఫ్ ఉద్యోగి ఆత్మహత్య

మడికొండ, సెప్టెంబర్ 28 : మున్సిపల్ కార్పొరేషన్‌లో డీఆర్ఎస్ ఔట్‌సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న నాగపురి కుమారస్వామి (55) కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన కుమారస్వామి బల్దియాలో డీఆర్ఎఫ్ విభాగంలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. తెల్లవారుజామున నాలుగున్నర గంటల సమయంలో నొప్పి తీవ్రం కావడంతో ఉరేసుకున్నాడు. గమనించిన తల్లి కేకలు వేయడంతో బంధువులు వచ్చి అతడిని దవాఖానకు తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు అనిల్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా నాగపురి కుమారస్వామి మరణ వార్త తెలుసుకున్న మేయర్ గుండు సుధారాణి రూ. 10వేలు, బల్దియా తరపున కమిషనర్ అశ్విని తానాజీ వాకడే రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

మృతదేహానికి జేఏసీ నేతల నివాళి..

వరంగల్ : బల్దియా డీఆర్ఎఫ్ బృందంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుడు కుమారస్వామి మృతదేహానికి బల్దియా జేఏసీ నాయకులు నివాళులర్పించారు. జేఏసీ అధ్యక్షుడు బొట్ల రమేశ్ నేతృత్వంలో ఎంజీఎం దవాఖాన మార్చురీకి వెళ్లిన నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో డీఎఫ్‌వో శంకరలింగం, జేఏసీ నాయకులు రాజారపు భాస్కర్, బాలునాయక్, బొక్క ఏలియ, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు మేకల దేవేందర్, కిషన్, అశోక్, శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ, సెప్టెంబర్ 28 : అక్టోబర్ రెండో తేదీ నుంచి ప్రారంభమయ్యే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లను చేయాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో, నగర పరిధిలో మహిళలు బతుకమ్మ ఆడుకునే ఆలయాల వద్ద పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ దీపాలు తదితర ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేయాలన్నారు. వేయిస్తంభాల ఆలయం, పద్మాక్షి ఆలయం, మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయాల వద్ద ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్లను గురించి అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, శంకరశర్మ, విష్ణువర్ధనాచార్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ తరపున ఆలయాల వద్ద బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ముఖ్య వైద్య ఆరోగ్యాధికారి రాజేశ్, డీసీపీ రవి, డీఎంహెచ్‌వో లలితాదేవి, డీఆర్వో గణేశ్, జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్డీవో నాగ పద్మజ, డీపీవో లక్ష్మీ రమాకాంత్, ఆర్డీవోలు వెంకటేశ్, నారాయణ, ఏసీపీ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి

ఆధ్యాత్మిక గురువు కమలానందభారతి స్వామి ఆశీస్సులు పొందుతున్న ఎమ్మెల్యే నాయిని, గంగు

వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించిన కమలానందభారతి స్వామి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 28 : ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, దేవాలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కమలానందభారతి స్వామి వేయిస్తంభాల దేవాలయాన్ని సందర్శించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకుడు భాస్కర్‌రావు, జయపాల్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 28 : విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం వడ్డేపల్లిలోని పింగిలి జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్ డేలో పాల్గొని మాట్లాడారు. మాజీ కార్పొరేటర్ నాగరాజు, తాళ్లపల్లి సుధాకర్ పాల్గొన్నారు. హనుమకొండలోని 10వ డివిజన్‌లో జయనర్సింగ్ కాలేజీ, మచిలీబజార్ వద్ద సీసీ రోడ్డు, సైడ్ డ్రెయిన్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కక్షిదారుకు తీర్పు ప్రతిని అందజేస్తున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

లోక్ అదాలత్‌లో 11,618 కేసుల పరిష్కారం

వరంగల్ లీగల్, సెప్టెంబర్ 28 : జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జిల్లా కోర్టు సముదాయంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు బీవీ నిర్మలా గీతాంబ, అపర్ణాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీపడదగు కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు హాజరై కేసును పరిష్కరించుకోవాలన్నారు. స్నేహపూరిత వాతావరణంలో ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన తీర్పు ద్వారా పరిష్కారం పొందాలని సూచించారు. లోక్ అదాలత్‌లో వరంగల్ జిల్లాలో 3,877 పెండింగ్ కేసులను, హనుమకొండ జిల్లాలో 7,741 పెండింగ్ కేసులను పరిష్కరించారు. వరంగల్ జిల్లాలో 8, నర్సంపేటలో ఒక బెంచీని, హనుమకొండలో 7 , పరకాలలో ఒక బెంచీని ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ హనుమకొండ ఆధ్వర్యంలో కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లను అందించారు. ఏసీపీ తిరుపతి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 28 : ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం ఆదివారం డయల్ యువర్ వరంగల్-1 డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ల ప్రయాణికులు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు 99592 26047 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కేయూ భూముల్లో ఆక్రమణలు తొలగించాలి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 28 : కాకతీయ యూనివర్సిటీ 229 సర్వే నంబర్ భూములను ఆక్రమించి కొందరు యూనివర్సిటీ ఉద్యోగులతో పాటు మరి కొందరు ఇళ్లు కట్టుకొన్నారని, ఆ ఇళ్లను కూల్చివేయాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు వినతిపత్రం అందజేశారు.

ప్రతి సోమవారం గచ్చిబౌలికి రాజధాని బస్సు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 28 : ఆర్టీసీ వరంగల్- 1 డిపో ఆధ్వర్యంలో హనుమకొండ నుంచి ప్రతి సోమవారం ఉదయం 5 గంటలకు గచ్చిబౌలికి ప్రత్యేక రాజధాని ఏసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నామని వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. గచ్చిబౌలి నుంచి 10.30 గంటలకు బయలుదేరుతుందని టికెట్ ధర రూ.450 అన్నారు. ఓపీఆర్ఎస్ సర్వీస్ నంబర్ అప్ 8277, డౌన్‌లో 8278 నంబర్‌లో ముందస్తుగా సీట్లు రిజర్వ్ చేసుకోవాలన్నారు. ఈ సర్వీసును ఉద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

కమలాపూర్, సెప్టెంబర్ 28 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు డాక్టర్ రాంబాబు శనివారం తెలిపారు. బీపీ, షుగర్ పరీక్షలతోపాటు రక్త పరీక్షలను చేపట్టారు. డాక్టర్ మాధవి, హెచ్ఈవో రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ అమృత పాల్గొన్నారు.

పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

కమలాపూర్, సెప్టెంబర్ 28 : మండలంలోని మర్రిపల్లి గూడెం గ్రామానికి చెందిన పొరండ్ల కృష్ణప్రసాద్ అఖిల భారత పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం శనివారం తెలిపారు. కృష్ణ ప్రసాద్ ఎంపికపై పద్మశాలీ సంఘం నాయకులు నరేందర్, రవీందర్, వెంకటేశ్వర్లు, శివశంకర్, రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.



కృష్ణప్రసాద్

'హెచ్ఎంను సస్పెండ్ చేయాలి'

కమలాపూర్, సెప్టెంబర్ 28 : మహిళా ఉపాధ్యాయులను వేధిస్తున్న కమలాపూర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజమల్లయ్యను సస్పెండ్ చేయాలని టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరుకొండ నరసింహస్వామి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భిక్షపతిలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజమల్లయ్యపై టీటీయూ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్‌జేడీకి ఫిర్యాదు చేశామన్నారు.

కిట్స్‌లో లింక్‌డిన్ ఎసెన్షియల్స్

హసన్‌పర్తి సెప్టెంబర్ 28 : ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో (లింక్‌డిన్ ఎసెన్షియల్స్) ప్రొఫెషనల్ గ్రోత్ కోసం ట్రైనింగ్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఐస్క్వేర్ ఆర్ఈహెడ్, ప్రొఫెసర్ రాజు, సురేందర్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

విద్యార్థులతో అధ్యాపకులు

మోడల్ పార్క్‌ను అభివృద్ధి చేయాలి : ఎంపీ కావ్య

హనుమకొండ, సెప్టెంబర్ 28 : నగరంలోని 59వ డివిజన్ కనకదుర్గకాలనీ పార్క్‌ను మోడల్‌గా అభివృద్ధి చేయాలని ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం కనకదుర్గకాలనీ పార్క్‌ను బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పరిశీలించారు. పార్క్‌లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌ను అభివృద్ధి చేయాలన్నారు. చిన్న వర్షానికే వర్షపు నీరు నిలుస్తున్నదని, పార్క్ స్థలం ఎత్తు పెంచి డ్రైనేజీ నిర్మించాలని సూచించారు. పార్క్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు సేవించకుండా వాచ్‌మెన్‌ను నియమించాలన్నారు. కార్పొరేటర్ వసంత పాల్గొన్నారు.

పార్కును పరిశీలిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

ప్రభుత్వ భూమిని కాపాడాలి

హనుమకొండ, సెప్టెంబర్ 28 : హంటర్ రోడ్డులో సర్వే నంబర్ 964లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి పేర్కొన్నారు. శనివారం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. జూపార్కు నుంచి దీన్‌దయాళ్‌నగర్‌కు వెళ్లే మార్గంలో గుట్టవైపు ఉన్న ప్రభుత్వ భూమిలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు నోటరీల పేరుతో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, విక్రయిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని 2021లో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, ఆ భూమిలో ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టారని గుర్తుచేశారు. పదిరోజుల క్రితం ఆ బోర్డును తొలగించి కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వెంటనే పనులు ఆపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆలకుంట్ల యకయ్య, బొల్లారం సంపత్, ఆలకుంట్ల మల్లయ్య పాల్గొన్నారు.

హనుమకొండ ఆర్‌డీవో ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు